నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, గురువారం 17 అక్టోబర్ 2024 | KAMAREDDY


కమ్మర్‌పల్లిలో ప్రైవేట్ వ్యాపారులకు సోయా విక్రయిస్తున్న రైతు

## రోడ్డెక్కిన మొసలి

ఏర్గట్ల, అక్టోబర్ 16: దారి తప్పిన ఓ మొసలి రోడ్డెక్కి హల్‌చల్ చేసింది. ఏర్గట్ల మండలంలోని తాళ్లరాంపూర్‌లో బుధవారం తెల్లవారుజామున మొసలి ప్రత్యక్షమైంది. నడిరోడ్డుపై తిరుగుతుండడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే కమ్మర్‌పల్లి ఫారెస్ట్ రేంజ్ అధికారులకు సమాచారమిచ్చారు. అయితే, వారు వచ్చేసరికి మొసలి రోడ్డు పక్కనున్న పొదల్లోకి వెళ్లింది. అక్కడి నుంచి పల్లె దవాఖాన, జీపీ భవనం పక్కనుంచి పొలాల్లో ఉన్న వ్యవసాయ బావి వైపు వెళ్లిందని స్థానికులు తెలిపారు. దాన్ని పట్టుకుని ఇక్కడి నుంచి తరలించాలని గ్రామస్తులు కోరారు.


తాళ్ల రాంపూర్‌లో రోడ్డు మీదకు వచ్చిన మొసలి

- రైతులపై కాంగ్రెస్ సర్కారు చిన్నచూపు
- రుణమాఫీ లేదు.. పెట్టుబడి సాయం లేదు..
- కనీసం పంటలు కొనే దిక్కు లేదు
- పేరుకే కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- ఎక్కడా ధాన్యం సేకరణ ప్రారంభించని వైనం
- లబోదిబోమంటున్న సోయా, వరి రైతులు
- దళారులకు అమ్ముకుంటున్న అన్నదాతలు

# జాడలేని కేంద్రాలు..


కమ్మర్‌పల్లి సొసైటీ ఆవరణలో పాస్‌బుక్‌లను క్యూలో ఉంచిన రైతులు(ఫైల్)

## ధాన్యం దళారుల పాలు

**కాంగ్రెస్ సర్కారు** రైతులను చిన్నచూపు చూస్తున్నది. ఇప్పటికే రుణమాఫీ, రైతుబంధు పెంపు వంటి హామీలను ఎగ్గొట్టిన ప్రభుత్వం.. ఇప్పుడు ధాన్యం సేకరణలోనూ మొండి'చేయి' చూపుతున్నది. ఉమ్మడి జిల్లాలో ఆర్భాటంగా ప్రారంభిస్తున్న సోయా, వరి కొనుగోలు కేంద్రాలు నామమాత్రంగానే మారాయి. ఆయా కేంద్రాలు కేవలం ప్రారంభానికే పరిమితమయ్యాయి. తప్పితే ఎక్కడా కాంటా వేసింది లేదు. ఒక్క గింజా కొన్నది లేదు. కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే మద్దతు ధర దక్కుతుందన్న రైతుల ఆశలు అడియాసలయ్యాయి. వర్షాలు కురిసే అవకాశముందన్న వాతావరణ హెచ్చరికలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. దళారులు చెప్పిన ధరకే తెగనమ్ముకుంటున్నారు.

–మోర్తాడ్/చందూర్, అక్టోబర్ 16

**ఉమ్మడి** జిల్లాలో జోరుగా వరి, సోయా కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నారు. అధికార పార్టీ నేతలు, అధికారులు ప్రారంభ ఆర్భాటాలకే పరిమితమవుతున్నారు తప్పితే ఎక్కడా కాంటా వేసిన దాఖలాలు లేవు. కమ్మర్‌పల్లిలో ఈ నెల 10న సోయా కొనుగోలు కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సోయ కొనుగోలు చేస్తామని ప్రకటించారు. కేంద్రాన్ని ప్రారంభించి వారం గడిచినా ఒక్క గింజా కొనలేదు. రైతులు ఉదయమే వెళ్లి పాస్‌బుక్ జిరాక్స్‌లను లైన్‌లో ఉంచారు. మధ్యాహ్నం దాటినా ఎవరూ రాలేదు. దీంతో అధికారుల వద్దకు వెళ్లి ఆరా తీస్తే ఇక్కడ కొనుగోలు చేయబోమని స్పష్టంగా చెప్పారు. సోయాలను వేల్పూర్ మార్కెట్ కమిటీకి తీసుకెళ్లి విక్రయించుకోవాలని చెప్పారు. ఖంగుతిన్న రైతులు.. ఈమాత్రం దానికి ఇక్కడ కొనుగోలు కేంద్రం ఎందుకు ప్రారంభించారని నిలదీశారు. మరోవైపు, వేల్పూర్ మార్కెట్ కమిటీలో విక్రయించిన సోయలు వెనక్కి పంపిస్తుండడంతో రైతులు పునరాలోచనలో పడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో క్వింటాకు రూ.4,892 మద్దతు ధర దక్కుతుందని భావించిన అన్నదాతలకు నిరాశే మిగిలింది. స్థానికంగా కొనుగోళ్లు లేక, వేల్పూర్‌కు వెళ్లలేక దళారులకే తక్కువ ధరకు విక్రయిస్తున్నారు.

### జోరుగా కోతలు.. కానరాని కేంద్రాలు

బాన్సువాడ డివిజన్‌లో వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. చందూరు తదితర ప్రాంతాల్లో చివరి దశకు చేరుకున్నాయి. కానీ ఇప్పటికీ కొనుగోలు కేంద్రాల జాడ లేకుండా పోయింది. వర్షాల ముప్పు పొంచి ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట కోతలను ముమ్మరం చేశారు. అయితే, కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి రాకపోవడంతో దళారులు గ్రామాల్లో వాలిపోతున్నారు. పచ్చి వడ్లు సైతం కొంటామని రైతులను ప్రలోభపెట్టి తక్కువ ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఓవైపు మేఘావృతమవుతున్న వాతావరణం, మరోవైపు ధాన్యం సేకరణ ప్రారంభం కాకపోవడంతో దళారులు సొమ్ము చేసుకుంటున్నారు.

### కాంగ్రెస్ రాకతో కష్టాలు..

కేసీఆర్ హయాంలో రైతులకు ఏమాత్రం కష్టాలు లేకుండా చూసుకున్నారు. కరెంట్, నీళ్లు మొదలు పంట సేకరణ దాకా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించారు. పంట పెట్టుబడి సాయంతో పాటు మద్దతు ధరకే కొనుగోళ్లు చేస్తూ రైతులకు అండగా నిలిచారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో రైతులకు కష్టాలు మొదలయ్యాయి. హస్తం పార్టీ హామీలను నమ్మిన రైతాంగానికి ప్రభుత్వం షాకుల మీద షాకులు ఇస్తున్నది. కొందరికే రుణమాఫీ చేసిన రేవంత్ సర్కారు.. మిగతా వారికి ఎగ్గొట్టింది. ఇక, పంట వేసే సమయంలోనే ఇవ్వాల్సిన రైతుబంధు సాయం.. పంట కోతలు ముగింపు దశకు చేరుతున్నా ఇవ్వలేదు. వరికి రూ.500 బోనస్ ఇస్తామని, అధికారంలోకి రాగానే సన్న వడ్లకే అని మాట మార్చింది. మద్దతు ధర చెల్లించి అన్ని పంటలను కొనుగోలు చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోయా కొనుగోళ్లు ప్రారంభించకుండా, ధాన్యం సేకరణ చేపట్టకుండా ఇబ్బందులు పెడుతున్నారని మండిపడుతున్నారు.


చందూరులో ధాన్యం కాంటా వేసేందుకు వచ్చిన హమాలీలు

#### తక్కువ ధరకే అమ్మేసిన..



మార్క్‌ఫెడ్ వాళ్లు కొంటామంటే మద్దతు ధర అస్తదని సంతోషమైంది. మొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించిండ్రు. అయినా ఒక్క గింజ కూడా కొనలే. అందుకే దళారులకే సోయలను అమ్మేసిన. క్వింటాల్‌కు రూ.4,350 చొప్పున ఇచ్చిండ్రు. అదే మార్క్‌ఫెడ్ కొని ఉంటే నాకు క్వింటాల్‌కు అదనంగా రూ.500 కలిసొచ్చేది. 33 క్వింటాళ్ల సోయలకు లెక్కగడితే రూ.16 వేలకు పైగా నేను నష్టపోయిన. నా లెక్కనే చాలా మంది దళారులకు అమ్మకుని నష్టపోతుండ్రు.

**- వేముల గంగాధర్, రైతు, కమ్మర్‌పల్లి**

#### కొనుగోళ్లు ప్రారంభించాలి..



కమ్మర్‌పల్లిలో సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తుంటే సంతోషపడ్డం. సోమవారం కొనుగోలు చేస్తారని చెప్పంగనే పాస్‌బుక్ జిరాక్స్‌లు లైన్లో పెట్టినం. మధ్యాహ్నమైనా ఒక్కరూ రాలే. ఏమైందని అధికారులను అడిగితే వేల్పూర్‌కు వెళ్లమని చెప్పిండ్రు. అదేదో ముందే చెబితే పొద్దంతా పడిగాపులు కాసేటోళ్లం కాదు కదా. కేంద్రం ఇక్కడ ప్రారంభించినప్పుడు సోయలను ఇక్కడే కొనాల కదా? కమ్మర్‌పల్లిలో గోదాంలు లేవని, వేల్పూర్ వెళ్లాలని అధికారులు చెబుతుండ్రు. గోదాంలు లేవన్న విషయం వాళ్లకు తెల్వదా? తెలిసీ ఎందుకు కమ్మర్‌పల్లిల కొనుగోలు కేంద్రం ప్రారంభించిండ్రు. మార్క్‌ఫెడ్ వెంటనే స్థానికంగా కొనుగోళ్లు ప్రారంభించాలె.

**- రెంజర్ల గంగాధర్, రైతు, కమ్మర్‌పల్లి**

# అకాల వర్షం.. తడిసిన ధాన్యం

రుద్రూర్/నస్రుల్లాబాద్, అక్టోబర్ 16: కొనుగోలు కేంద్రాలు లేక సతమతమవుతున్న రైతులను అకాల వర్షాలు మరింత ఆగం చేస్తున్నాయి. రుద్రూర్ మండలం సులేమాన్‌నగర్‌లో బుధవారం వర్షం కురియడంతో ధాన్యం తడిసి పోయింది. ఇటీవల పంట కోసి రైతులు కల్లాల్లో, రోడ్లపై ధాన్యాన్ని ఆరబెట్టారు. అయితే, కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభం కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అటు బీర్కూర్‌లో కురిసిన వర్షానికి.. మార్కెట్ యార్డులో ఆరబెట్టి ధాన్యం తడిసింది. కొనుగోలు కేంద్రాలు లేకపోవడం వల్లే వడ్లు తడిశాయని రైతులు వాపోయారు.


సులేమాన్‌నగర్‌లో వర్షానికి తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు

# మాదిగలను వంచించిన రేవంత్ సర్కార్

## ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

ఖలీల్‌వాడి, అక్టోబర్ 16: రేవంత్‌రెడ్డి సర్కార్ మాదిగ జాతిని వంచించిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ విమర్శించారు. నమ్మకద్రోహానికి గురైన మాదిగలు రోడ్డు ఎక్కే పరిస్థితి నెలకొందని, ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయకపోతే మరో పోరాటం తప్పదని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మందకృష్ణ మాదిగ మాట్లాడారు. రాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణను అమలు చేసుకోవచ్చని సుప్రీంకోర్టు ఆగస్టు 1న ఆదేశాలు జారీ చేసిందని, అయినా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, తెలంగాణలోని మాలల ఒత్తిడితో రేవంత్‌రెడ్డి సర్కారు వర్గీకరణను తొక్కి పెట్టేందుకు యత్నిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తూ మాదిగలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని, కానీ వర్గీకరణ చేపట్టకుండా ఉద్యోగాల భర్తీ చేస్తున్నారని మండిపడ్డారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి గతంలో ఎస్సీ వర్గీకరణ కోసం జరిగిన పోరాటాల్లో పాల్గొని అందరినీ నమ్మించాడని, ఇప్పుడు ఇలా మోసం చేస్తున్నారని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ కోసం స్వయంగా అన్ని పోరాటాలలో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని అందరినీ నమ్మించారని ఇప్పుడు ఇలా చేయడం సరికాదన్నారు. దివ్యాంగుల పింఛన్లను రూ. 6 వేల వరకు పెంచుతామని చెప్పి పెంచకపోవడం సిగ్గుచేటన్నారు. యావత్ మాదిగ జాతి మరో పోరాటానికి సిద్ధమవుతున్నదని, ప్రభుత్వం సిద్ధంగా ఉండాలన్నారు.



ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ


బోధన్‌లో ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకుల మానవహారం

# మూడోరోజూ మూతే

- తెరుచుకోని డిగ్రీ, పీజీ కాలేజీలు
- కొనసాగుతున్న కళాశాలల నిరవధిక బంద్

బోధన్/ఖలీల్‌వాడి, అక్టోబర్ 16: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీలు చేపట్టిన నిరవధిక బంద్ కొనసాగుతున్నది. మూడో రోజు బుధవారం కూడా కళాశాలలు తెరచుకోలేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని నిజామాబాద్, బోధన్‌లో ప్రైవేట్ కళాశాలల యజమానులు, ఉద్యోగులు మానవహారం నిర్వహించారు. బోధనా, బోధనేతర సిబ్బంది అందరూ ఈ నిరసనలో పాల్గొన్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయని కారణంగా ఉద్యోగుల జీతభత్యాలు, భవనాల అద్దె, కళాశాలల నిర్వహణ భారంగా మారిందని యజమానులు వాపోయారు.

**మందకృష్ణతో భేటీ..**

ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం పోరుబాట పట్టిన ప్రైవేట్ కళాశాలల యజమానులు తమ పోరాటానికి మద్దతు ప్రకటించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు విజ్ఞప్తి చేశారు. నిజామాబాద్‌కు వచ్చిన ఆయనను కలిసి తమకు సహకరించాలని కోరారు. స్పందించిన మందకృష్ణ మాదిగ తమ పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. మూడురోజులుగా కళాశాలలు బంద్ పాటించడం తెలిసి విచారం వ్యక్తం చేశారు.

**సర్కారు దిష్టిబొమ్మ దహనం..**

డిచ్‌పల్లి, అక్టోబర్ 16: విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ తెలంగాణ యూనివర్సిటీలో సర్కారు దిష్టిబొమ్మను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో దహనం చేశారు. పెండింగ్‌లో ఉన్న రూ.8 వేల కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను వెంటనే విడుదల చేయాలని విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు. మూడు రోజులుగా ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీలు బంద్ పాటిస్తున్నా ప్రభుత్వం స్పందించక పోవడం సరికాదన్నారు. వెంటనే ప్రైవేట్ యాజమాన్యాలతో చర్చించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు రాచకొండ విఘ్నేశ్, దినేశ్, చక్రి, జీవన్, అశోక్ పాల్గొన్నారు.



ఇందూరులో...

# 'రైతును పట్టించుకోని సర్కారు'

ఆర్మూర్‌టౌన్, అక్టోబర్16: కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించక పోవడంతో రైతులు దళారులకు అమ్మి నష్టపోతున్నారని రైతు జేఏసీ నేత, బీఆర్ఎస్ నాయకుడు లింగారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆలూరులో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. రేవంత్ సర్కారుకు రైతు సమస్యలపై చిత్తశుద్ధి లేదన్నారు. రైతులందరికీ రుణమాఫీ చేయకుండా, రైతుబంధు ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. చివరకు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర దక్కకుండా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం లేదని విమర్శించారు. వరికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్.. ఇప్పుడు కేవలం సన్నరకాలకే అని చెప్పడం మోసం చేయడమేనన్నారు. బోనస్ సంగతి దేవుడెరుగు ముందు కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకే దిక్కు లేకుండా పోయిందని విమర్శించారు. అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ధాన్యం తడుస్తుందనే భయంతో రైతులు తక్కువ ధరకే దళారులకు అమ్ముకుంటున్నారన్నారు. అటు మద్దతు ధర దక్కక, ఇటు బోనస్ రాక రైతులు నష్టపోతుంటే రేవంత్ ప్రభుత్వం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. రైతులపై కాంగ్రెస్‌కు ఏమాత్రం ప్రేమ ఉన్నా వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి దళారుల నుంచి రైతులను కాపాడాలని కోరారు. రైతులు సోమ ఎర్రన్న, మగ్గిడి నర్సయ్య, భూమరెడ్డి, చిన్నయ్య, శీను పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రైతు నాయకులు

# పత్తాలేని హాస్టల్ సిబ్బంది

భయంతో విద్యార్థుల రోదన
బంధువుల ఇంటికి పంపిన స్థానికులు

నాగిరెడ్డిపేట, అక్టోబర్16: నాగిరెడ్డిపేటలోని వసతిగృహంలో అధికారులు, సిబ్బంది పత్తా లేకుండా పోయారు. దీంతో హాస్టల్‌లో ఉన్న విద్యార్థులు భయంతో రోదిస్తూ బయటికి వచ్చారు. అసలేం జరిగిందంటే.. దసరా పండుగకు హాస్టల్‌కు సెలవులు ఇవ్వడంతో విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోయారు. ఈ వసతిగృహంలో వంద మందికి పైగా ఉండగా, బుధవారం ఇద్దరు విద్యార్థులు కిశోర్, హరీశ్ మాత్రమే తిరిగి వచ్చారు. సాయంత్రం భోజనం పెట్టిన కామాటి ఇంటికి వెళ్లిపోగా, నైట్ వాచ్‌మన్ అన్వర్ కూడా బయటికి వెళ్లాడు. రాత్రి అవుతుండడం, హాస్టల్‌లో కిశోర్, రాకేశ్ మాత్రమే ఉండడంతో వారు భయానికి లోనయ్యారు . దీంతో రోదిస్తూ బయటకు రాగా, గమనించిన స్థానికులు ఏం జరిగిందని ఆరా తీయగా జరిగిన విషయం చెప్పారు. దీంతో స్థానికులు హాస్టల్ వార్డెన్ రాములుకు ఫోన్ చేయగా, నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. అదే సమయంలో హాస్టల్‌కు వచ్చిన వాచ్‌మన్ అన్వర్ మద్యం మత్తులో ఉన్నాడు. అతడ్ని ప్రశ్నిస్తే తనకు, పిల్లలకు ఎలాంటి సంబంధం లేదని, తన డ్యూటీ కేవలం రాత్రి వచ్చి పడుకుని ఉదయం వెళ్లడమేనని దురుసుగా చెప్పాడు. విద్యార్థుల పరిస్థితిని గమనించిన స్థానికులు.. వారి తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. వారు బంధువులను పంపించగా, పిల్లలను వారికి అప్పగించారు.


రాత్రి 8:30 గంటలకు వసతిగృహం గేటు ఎదుట నిరీక్షిస్తున్న విద్యార్థులు